# అమ్మమ్మ

శ్రీనివాసరావు మాణిక్యమ్మ వైభవంగా కొడుకు పెళ్ళి జరిపించారు. తమకి అన్ని విధాలా తగిన కోడలే దొరికింది. ఆడపిల్లవారు కూడా అనుకున్నట్లు అన్ని ఏర్పాట్లూ చేసి రెండు వర్గాల బంధువుల్నీ ఆనందపరిచారు. ఒకట్రెండుచోట్ల ఇబ్బందులొచ్చినా శ్రీనివాసరావు ముఖ్యంగా మాణిక్యమ్మ సర్దుకుపోవటానికి ఇష్టపడ్డారు. "వాసంతి రేపట్నుంచి మనింట్లో కాపురం చేయాల్సిన అమ్మాయండీ – ఇవ్వాళ మనం నోరు చేసుకుని వాళ్లని చిన్నబుచ్చితే చుట్టాలు అందరూ సంతోషిస్తారేమోగానీ కోడలుపిల్ల దృష్టిలో మనం పేచీకోర్లుగా మిగిలిపోతాం మనమూ ఆడపిల్లల పెళ్ళిళ్లు చేయాల్సినవాళ్లం – మాట్లాడకుండా ఊరుకోండి" అని మాణిక్యం శ్రీనివాసరావుతో అంది.

భార్య చెప్పిన మాటలకి శ్రీనివాసరావు సిగ్గుపడ్డాడు – వప్పుకున్నాడు. తలదించుకున్నాడు. ముప్పయ్యేళ్ల కాపురంలో ఎప్పుడూ నోరెత్తి సలహా చెప్పని మాణిక్యమ్మ ఇవ్వాళ అన్నమాటల్లో భుజం తడుముకోవలసిన మాటలు ఉన్నాయని అర్థం ధ్వనించింది.

✦ ✦ ✦

నిజమే!

శ్రీనివాసరావు పెళ్లి–

ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్న మాణిక్యం తండ్రి తనకున్నంతలో పెద్దకూతురు మాణిక్యం పెళ్లి చేస్తున్నాడు. వియ్యాలవారికి

అంటే... శ్రీనివాసరావు తల్లిదండ్రులకీ వారివైపు బంధువులకీ మాణిక్యం తప్ప- వాళ్లు ఏర్పాటు చేసిన మర్యాదలు నచ్చలేదు.

సుముహూర్తం అవగానే పెళ్లితంతు ఎలాగో అయిందనిపించి పెళ్లి విందు కూడా అందుకోకుండా మాణిక్యాన్ని తీసుకుని వెళ్లిపోయాడు. అసలు శ్రీనివాసరావు తల్లిదండ్రులు మాణిక్యాన్ని కూడా దిగవిడిచే వెళ్ళేవారేమో కానీ శ్రీనివాసరావు వప్పుకోలేదు- పెళ్ళినాటి మర్యాదలు చాలక మాణిక్యం కుటుంబంతో శ్రీనివాసరావు కుటుంబం శాశ్వతంగా విడిపోయింది.

తండ్రి చనిపోయినా మాణిక్యం వెళ్లలేదు. కాదు... వెళ్లడానికి వీల్లేదు.. మొగుడి శాసనం-

ఆ తర్వాత చాన్నాళ్లకి మాణిక్యం అత్తగారూ.. ఇంకోన్నాళ్లకి మావగారూ పోయినా.. మాణిక్యం తల్లికి కబురు వెళ్లలేదు. అది మొగుడి నిర్ణయం.

తల్లీతండ్రి పెట్టుకున్న పంతాలు శాశ్వతంగా వారసత్వంగా శ్రీనివాసరావు కొనసాగిస్తున్నాడు!ట

'మీ అమ్మా నాన్నా ఇప్పుడు లేరుగా- మా అమ్మని ఒకసారి చూసొద్దామండీ' అని మాణిక్యం అడగలేదు.. అడగనూ లేదు.

30 ఏళ్లు గడిచిపోయాయి.

పాతికేళ్లు దాటిన కొడుకు శశాంక్‌కి పెళ్లి చేస్తున్నారు శ్రీనివాసరావు దంపతులు. "మనం ఇంకా ఇద్దరమ్మాయిలకి పెళ్లి చేయాలి. వాళ్ల చదువులు పూర్తవగానే పెళ్లి సంబంధాల వేట కొనసాగుతుంది. ఇప్పుడు మళ్లీ ఆడపెళ్లి వాళ్ల మీద విరుచుకుపడితే బాగోదు" భార్య మాట శ్రీనివాసరావుకి నిజమే- అనిపించలేదు కానీ.. ఆమె చెప్పిన మాటకి మారుమాటాడకుండా 'అవును కదా' అనుకున్నాడు. మామూలుగా మారిపోయాడు- సర్దుకు

పోవాలనుకున్నాడు.

✦ ✦ ✦

దంపతులిద్దర్నీ హనీమూన్‌కెళ్లమని 15వేలు సేంక్షన్ చేశాడు శ్రీనివాసరావు. కొడుకు కోడల్ని పక్కకి పిల్చింది మాణిక్యం.

“నాకో చిన్న కోరిక ఉందర్రా తీరుస్తారా?” అంది గద్గదంగా.

“చెప్పు - అమ్మా”

మాణిక్యం మాట కొంతసేపు పెగల్లేదు–

“చెప్పండి అత్తయ్యా” కోడలు ప్రేమగా అడిగింది.

“మీరు హనీమూన్‌కి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేముందు అయినా మీ అమ్మమ్మ దగ్గరికి వెళ్లాల్రా! ఆవిడ ఆశీర్వాదం తీసుకోవాలి”

ఇద్దరూ కన్నీళ్లతో చెప్తున్న ఆమె మాటల్ని వింటున్నారు.

“అత్తయ్యా.. మీ అమ్మగారు పెళ్లికి రాలేదా?” కొత్తకోడలు ఆత్మీయంగా అడిగింది.

“రాలేదమ్మా! మేము పిలవలేదు”

“రాలేని స్థితిలో ఉందా అమ్మమ్మ?”

“కాదు.. నేను పిలవలేని స్థితిలో ఉన్నాన్రా” కళ్లనీళ్లు పొంగి గొంతులో దుఃఖం రాయి గట్టింది.

“కాకినాడ దగ్గర సర్పవరంలోనే ఉంటోందిట– మా నాన్న పేరు కొండపూడి పరమేశ్వరం– ఆయన లేరు. మా అమ్మని బుల్లమ్మాయి అనేవారు. అసలు పేరు సీతామాలక్ష్మి”

ఇంకా వివరాలు చెప్పేలోగా.. ఎవరో రావటం వల్ల ఎడ్రస్ తనకి తెల్సున్నంతలోనే చెప్పగలిగింది.

కొత్తకోడలు వాసంతికి అత్తగారి మాతృప్రేమ మీద అమితమైన ఆదరణ కలిగింది.

ముందు ఆ మామ్మగారి దగ్గరికే వెళ్దామని భర్తని కోరింది.

ఆలుమగలు హనీమూన్.. 'అన్నవరం' అని డిక్లేర్ చేసి బైల్దేరారు.

✦ ✦ ✦

"సర్వారం ఎల్లాలంటే బొస్సులుంటాయండి- ఎనిదుకండి ఆటో కుదురిత్తా- ఎల్లిపోండి- రిచ్చాలో మీరు కోకోలేరు.. నేను లాగలేను" రిక్షావాణ్ణి అడిగితే నిజాయితీగా చెప్పాడు.

"సర్వారం ఏడకెల్లాలండి" ఆటోవాడు అడిగాడు.

"చూద్దాంపోనీ.. పెద్దవూరా?"

"పెద్ద వూరంటే.. పెద్దదే.. గుడికెళ్లే భక్తులు ఈణ్ణించే ఆటోలెక్కి వెల్తారు. మడిసికి ముఫ్పై రూపాయలు తీసుకుంటాం- గుడికాణ్నించి ఊళ్లోకెల్లాంటే.. రేటు మారుద్ది" అన్నాడు ఆటోవాడు.

"సరే గుడి దగ్గరికి పోనీయ్"

ఆలస్యం చెయ్యకుండా ఎక్కేసారు శశాంక్-వాసంతి.

ఇన్నాళ్లుగా అమ్మమ్మ మాట ఎప్పుడూ వినలేదు శశాంక్.

ఆవిడ పేరు సీతామాలక్ష్మి... ఏదో ముద్దుపేరుతో పిలిచేవారుట!

ఆ పేరు ఏంటి.. గుర్తురావట్లేదు- 'సర్లే వెళ్లేలోగా గుర్తొస్తుంది' అనుకున్నాడు.

'అయినా ముసలావిడకి ముద్దుపేరు ఏంటో- సీతామాలక్ష్మి పేరు గుర్తుంది కదా' అనుకున్నారు.

సర్పవరం గుడిముందు ఆటో ఆగింది.

దైవదర్శనం చేసుకున్నారు.

సీతామాలక్ష్మిగారి ఇంటికి వెళ్లాలి! గుడి బైటికొచ్చి ఒక భక్తుణ్ని అడిగాడు.

ఒక రిక్షావాణ్ని అడిగాడు. అతనూ తెలియదన్నాడు. చాలామందిని అడిగారు. ఎవరూ సీతామాలక్ష్మిగారు ఎవరో తెలీదన్నారు. ఆఖరికి ఒక వ్యక్తి "బుల్లెమ్మగారి వీధికెళ్ళండి– ఆడ పోస్టాఫీసు వుంటుంది. ఆళ్లనడిగితే సెప్తారు"

"ఏవండీ నేనెళ్ళాల్సినది బుల్లెమ్మగారింటికే" అరిచినట్లు అన్నాడు శశాంక్.

"మరా ముక్క ముందే సెప్పచ్చుగా" రిక్షావాళ్లంతా ముక్తకంఠంతో అరిచినట్లు అన్నారు.

అందరూ నేను తీసుకెళ్తానంటే.. నేను తీసుకెళ్తానని పోటీపడ్డారు.

"ఎంతివ్వాలి" అంది గడుసుగా వాసంతి.

"డబ్బులొద్దొమ్మా ఎక్కండి– బుల్లెమ్మగారి ఇంటికి ఎల్లాలంటే.. బుజాలమీద ఎక్కించుకు తీసుకుపోతాం– ఆ మా తల్లి మా వూరి దేవత– మా అందరికీ వొణ్ణం పెట్టిన మహాదాత" కొయ్యబారిపోయి రిక్షా ఎక్కారు దంపతులు.

"ఆయమ్మగారింటికి ఏ పనిమీద ఎల్తున్నారండీ" మాటలు కలిపాడు రిక్షావాడు.

చెబ్దామా వద్దా అని తటపటాయిస్తున్నాడు శశాంక్.

"అది కాదయ్యా– బుల్లెమ్మగారి పేరు వినగానే నువ్వంత భక్తిగా ప్రేమగా పలకరించావు– ఆవిడ ఏం చేస్తుందసలు" వాసంతి అన్నమాటలకి రిక్షా డ్రైవర్ బ్రేకువేసి, దిగి.. "ఆయమ్మ మా వూరి దేవత– ఇక్కడ

నాలాంటోళ్లు ఇంత అన్నం తింటున్నారంటే ఆయమ్మ సలవేనమ్మా- ఒక్కగానొక్క కూతురు మాణిక్యమ్మ అనే యావిడుండేది- పెళ్లి చేసుకుని మళ్లీ ఈయమ్మవైపు కన్నెత్తి సూళ్లేదు. ఏదుందో తెలియదు. ఈయమ్మ మొగుడు పోయినాక.. ఆయన ఆస్తి ఏం చేయాలో తెలీక.. ఊళ్లో నలుగురు పెద్దల్నీ పోగేసింది. ఆళ్లనడిగి పేదోళ్లెవరో ఎంచుకుంది. పిల్లల్లేనమ్మలా ఉన్నదంతా పేదోళ్లకి ఇచ్చేసింది. ఈణ్నుంచి కాకినాడ- కాకినాడేంటి మా జిల్లా అంతా ఆవిడకి దణ్నం ఎట్టి ఎల్తారు. డొక్కా సీతమ్మ గారి బుల్లి సెల్లాయి అనుకోండి బుల్లెమ్మగారు" అని మళ్లీ రిక్షా ఎక్కాడు అతను.

"డొక్కా సీతమ్మగారు ఎవరండీ" రహస్యంగా అడిగింది వాసంతి. సైలెంట్‌గా పెదవి విరుస్తూ తెలీదన్నట్లు తలాడించాడు శశాంక్.

రిక్షా బుల్లెమ్మగారి ఇంటి ముందు ఆగింది.. తాటాకుల్తో నేసిన పాకలో అరవై ఏళ్లు దాటిన బుల్లమ్మాయి చాలా ఆరోగ్యంగా ఆనందంగా వుంది- అమ్మమ్మ అని కాదు గానీ చూడగానే దణ్నం పెట్టాలనిపించింది.

"ఎవరుబాబూ మీరు"

నా పేరు శశాంక్.. ఈమె వాసంతి"

"కొత్తగా పెళ్లైనట్టుంది... ఎక్కడుంటారు"

"హైదరాబాద్"

"గుడికొచ్చారా.. మా దేవుడికి మొక్కుకుంటే బంగారంలాంటి పిల్లలు పుడతారు"

"గుడికి ఇంకా వెళ్ళలేదు- ముందు నీ ఆశీర్వాదం తీసుకుందామని వచ్చాం... అమ్మమ్మా"

"ఈ పిలుపు కొత్తగా వుంది- మా వూళ్లో అందరూ బామ్మగారనో బుల్లెమ్మగారనో అంటార్లే- అమ్మమ్మ అనరు" నవ్వుతూ అంది.

దణ్ణం పెట్టారు ఇద్దరూ. మనస్ఫూర్తిగా ఆశీర్వదించింది. అరుగుమీద కూచోపెట్టుకుంది–

"నేను మాణిక్యమ్మ కొడుకుని" ఆవిడ ముఖం ఆశ్చర్యంగా మారింది. "నేను మీ మనవణ్ని" పరిశీలనగా చూస్తోంది.

"మా పెళ్లవగానే అమ్మ నీకు దణ్ణం పెట్టిరమ్మంటే వచ్చాను"

ఆవిడ కళ్లలో నీళ్లు తిరిగాయి– కళ్లు తుడుచుకుంటూ..

"ఒరే.. నా కళ్లలో నీళ్లొచ్చి చాలా ఏళ్లయింది– కన్నీళ్లు తుడవడమే తప్ప కళ్ళనీళ్లు పెట్టకూడదనుకున్నాను. మిమ్మల్ని చూస్తే పాత బుల్లమ్మ అయిపోతున్నాను. త్వరగా వెళ్లిపోండిరా.. మీరు ఉంటే నాలో స్వార్థం నా అన్నవాళ్లున్నారన్న మమకారం పెరిగిపోతుంది. ఆ మమకారం మళ్లీ ఇలా కన్నీళ్లలో ముంచేస్తుంది. వెళ్లండి.. మీ అమ్మకి మాత్రం నన్ను చూశానని చెప్పకండి! దానికీ లేనిపోని బెంగ పెరుగుతుంది. వెళ్లిపోండి" అటెళ్తున్న రిక్షాని పిలిచి "ఒరే– అన్నారం... వీళ్లని వెంకటేశం బట్టల దుకాణానికి తీసుకెళ్లు– అబ్బాయికీ, అమ్మాయిగారికీ నచ్చిన జత ఇమ్మను– సాయంత్రం వచ్చి సొమ్ములు తీసుకోమను"

"ఏమీ అనుకోకండర్రా.. నేను ప్రేమ పంచడమే తప్ప ప్రేమ పొందలేను"

హాయిగా నవ్వుతూ సాగనంపింది.

అమ్మమ్మని అనవసరంగా చూసామా అనుకున్నాడు– కానీ వెంటనే కాదు.. ఆలస్యంగా కలిసాం– అనుకున్నాడు–

బరువెక్కిన గుండెల్తో రిక్షా ఎక్కారు.

వెనక్కి తిరిగి చూస్తే అమ్మమ్మ లోపలికెళ్లిపోతోంది, ప్రేమని జయించిన విరాగినిలా.

